క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి , ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ పుష్పలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడి

రామాపురం: సకాలంలో మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిగ దిగుబడి పొందవచ్చునని ఉద్యాన శాఖ అధికారి టి.నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నీలకంట్రావుపేట, సుద్దమళ్ల గ్రామాల పరిధిలో మామిడిపై వచ్చే చీడపీడలు, వాటి నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హారిక పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రాయచోటి టౌన్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ట్రాఫి క్ ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆటో డ్రైవర్లకు సూచించారు. శుక్రవారం రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్లు అన్ని రకాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు.

చిరుధాన్యాల ఆహారం వాడాలి

రామాపురం : చిన్న పిల్లలకు చిరుధాన్యాలతో చేసిన ఆహారం అందించాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వై.పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు క్లస్టర్ పరిధిలోని బండపల్లి, కుమ్మరపల్లె, రాచపల్లె, చిట్లూరులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పోషణ పట్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. పంచాయితీ కార్యదర్శి చంద్రకళ, సూపర్‌వైజర్లు అరుణాదేవి, తులసి, సుభాషిణి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చిన్నమండెం : మండలంలోని మల్లూరు క్రాస్‌లో సర్పంచ్ భూమసాని లక్ష్మణరెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీఓ రహీమ్, పంచాయతీ సెక్రటరీ సుమిత్రమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపీటీసీ శ్యాంచంద్ర, ఉపసర్పంచ్ పెద్దరెడ్డప్ప పాల్గొన్నారు.

భూముల సబ్ డివిజన్ పూర్తి చేయాలి

సిద్దవటం: అసైన్‌మెంట్ భూముల సబ్ డివిజన్ త్వరిత గతిన పూర్తి చేయాలని సర్వేయర్లకు ఆదేశించామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం అసైన్‌మెంట్-రీ సర్వేపై మండల సర్వేయర్ సుధాకర్, సచివాలయాల సర్వేయర్లతో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాజంపేట: రాజంపేట పెద్దాసుపత్రి (వైద్యవిధాన పరిషత్ ఏరియా హాస్పిటల్)లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత రక్తదానం చేశారు. అసిస్టెంట్ సివిల్ సర్జన్ డా.చంద్రకళ మాట్లాడుతూ 27 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిపారు.

గిరిజన ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి

రాయచోటి అర్బన్ : గిరిజన ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, లంబాడీ సంఘం రాష్ట్ర నేత శంకర్ నాయక్, ఆల్‌ఇండియా బంజారా సంఘం జిల్లా నేత నారాయణ నాయక్‌లు డిమాండ్ చేశారు. జీఓ నం. 52ను వెంటనే రద్దుచేయాలన్న డిమాండ్‌తో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దగల అంబేద్కర్ చిత్రపటం వద్ద గిరిజనులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

లక్కిరెడ్డిపల్లి: ఏప్రిల్ 3 నుంచి జరగబోవు పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం వంట ఏజెన్సీ ఆంజనేయులు 82 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నమండెం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఒత్తిడికి గురికాకుండా బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి విద్యార్థినులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు.

నందలూరు (రాజంపేట): పాటూరు జడ్పీహైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రిని శుక్రవారం హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా చైర్మన్ డేవిడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు రైటింగ్‌ప్యాడ్, స్కేల్, పెన్ ఇచ్చామన్నారు. ముస్లీం చైర్మన్ జుల్ఫీకర్, హెడ్‌మాస్టర్ మాధవీలత పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా ఓ వరం

– ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మూడో విడత వైఎస్సార్ ఆసరా సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు: వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు వరమని వైఎస్సార్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్సార్ ఆసరా సదస్సును గాలివీడు హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి మూడు విడతలుగా నిధులను మంజూరు చేశారన్నారు. గాలివీడు మండలంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద రూ. 4.03 కోట్లు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేయని చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికోసం నిరంతరం శ్రమించే జగనన్న ప్రభుత్వంపై దుష్టచతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. జగన్ పాలనలో మూడు సార్లు వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు నిండి గేట్లు కూడా ఎత్తడం జరిగిందన్నారు. ఇదే ధర్మపాలనకు నిదర్శనమన్నారు. జగన్ వైపు ధర్మం, న్యాయం ఉన్నాయన్నారు. చంద్రబాబు పాలన అంతామోసం, దగాలతో జరిగిందన్నారు. ప్రకృతి కూడా జగన్ పాలనకు సహకరిస్తోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చక ఆన్‌లైన్‌లో మ్యానిఫెస్టోను లేకుండా చేసిన వ్యక్తి అన్నారు. అదే జగన్ పాలనలో 98 శాతానికిపైగా హామీలను నెరవేర్చి మాటమీద నిలబడే వ్యక్తిగా పేరొందారన్నారు.

ఆత్మీయ స్వాగతం : వైఎస్సార్ ఆసరా సదస్సుకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. సదస్సులో డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

పరామర్శ: వైఎస్సార్‌సీపీ టీచర్స్ యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు శంకర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆయన్ను పరామర్శించారు.

మెగా చెక్ అందజేత : వైఎస్ఆర్ ఆసరా మూడో విడతలో గాలివీడు మండలంలోని 673 సంఘాలకు రూ. 4.03 కోట్ల మెగా చెక్‌ను ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జనరంజకంగా జగన్ పాలన సాగుతోందన్నారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదభూషన్ రెడ్డి, జడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, గాలివీడు సర్పంచ్ లక్ష్మీదేవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషన్ రెడ్డి , నూలివీడు సర్పంచ్ ఉమాపతి రెడ్డి , యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మా అమరనాథరెడ్డి , గోరాన్ చెరువు సర్పంచ్ దీప్తి మాట్లాడారు.

ఆదర్శ టౌన్‌షిప్‌గా రాజీవ్ స్వగృహ

రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంగా రాజీవ్ స్వగృహను ఆదర్శ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజీవ్ స్వగృహలో రూ.3.81 కోట్లతో సీసీ రోడ్లు, మౌలిక వసతుల నిర్మాణాలకు జరిగిన భూమిపూజలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. 4 నెలల వ్యవధిలో ఈ పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి రాజీవ్ స్వగృహలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, గృహ యజమానులతో చర్చించారు. సుమారు రూ.4 కోట్ల నిధులతో పార్క్, పాత రోడ్ల రెన్యువల్, సుందరీకరణ పనులను కూడా చేపడతామన్నారు. 57 ఎకరాలలో ఉన్న లేఅవుట్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, బీసీ నాయకులు పల్లపు రమేష్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు అయ్యవారురెడ్డి, కాంట్రాక్టర్ చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ హరిజనవాడలోని మండల ప్రాథమిక పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ శ్రీరాములునాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగం ప్రకారం పౌరుడికి కలిగి ఉండే హక్కుల గురించి వివరించారు. పౌరుల ప్రాథమిక హక్కుల విధివిధానాల గురించి కూలంకుశంగా వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ దివ్య, రహీం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

రాజంపేట టౌన్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నందున స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం సరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆ పాఠశాల హెచ్ఎం రఘునాథరాజు విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు బాలరాజు సహకారంతో విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి జీ.చక్రధర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ

చిట్వేలి: మనచుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాలలో మునగ మొక్కలను పెంచడం ద్వారా ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చని వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ ప్రసాద్ పేర్కొన్నారు. డీఈఓ ఆదేశాల మేరకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నర్సరీని పెంచి శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలలకు మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వెంకటసత్యనారాయణ, రవికుమార్, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి ఆదినారాయణరెడ్డి, రూత్ మేరీ, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలన ఆదర్శనీయం



గురిగింజకుంట గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : విప్లవాత్మక మార్పులతో ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గురిగింజకుంట గ్రామంలోని చిన్నపాపిరెడ్డిగారిపల్లె, దిన్నెపల్లె, మల్లూరువాండ్లపల్లె, నాయనవారిపల్లె, హరిజనవాడలలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్ అన్నారు.

పండగ వాతావరణంలో..

ఎమ్మెల్యే గ్రామంలోకి రాగానే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటా ఘన స్వాగతం పలికారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార దర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని గ్రామంలోని ప్రజలు సంతృప్తి చెందినట్లు తెలిపారు.

నేటితో 100 రోజులు పూర్తి: ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రాయచోటి నియోజకవర్గంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం 100 రోజులు పూర్తయింది. 50 సచివాలయాలలో ఇప్పటివరకు విజయవంతంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, రాష్ట్రకార్యదర్శి చిదంబరంరెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, జడ్పీటీసీ కవిత, మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, ఎంపీటీసి శ్రీధర్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

చిన్నమండెం : జనహితమే జాతీయ సేవా పథకం ముఖ్య ఉద్దేశ్యమని సమాజసేవలో భాగస్వామ్యమే దీని పరమావధి అని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని నాయకత్వ లక్షణాలను నెలకొల్పుకోవచ్చని ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్ తెలిపారు. అనంతరం విద్యార్థుల నైతిక, మానసిక వికాసం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు మారుపేరుగా తీర్చిదిద్దుదాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : స్వచ్ఛతకు మారుపేరుగా రాయచోటిని అందరం కలసికట్టుగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో మెప్మా ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, పారిశుధ్య విభాగం కార్మికులు నిర్వహించిన స్వచ్ఛమార్చ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిపరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాయచోటిని స్వచ్ఛ రాయచోటిగా మార్చేందుకు తమవంతు కృషిచేస్తామంటూ ఈ సందర్భంగా ఆయన మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మెప్మాకార్యాలయంలో నైపుణ్యం పెంపు, ఎస్‌హెచ్‌జీ సంఘాల బలోపేతం కోసం ఇస్తున్న శిక్షణలో పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సీఎంఎం అబ్బాస్ అలీ, మెప్మా అధికారి నాగరాజు, శానిటేషన్ కార్యదర్శులు నరసింహులు, ఎస్‌హెచ్‌జీల మహిళలు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

సచివాలయం అధికారులు మరింత బాధ్యతతో పనిచేయడం ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అన్నారు.

మున్సిపల్ సభాభవనంలో శనివారం మధ్యాహ్నం ఆయన పట్టణ ప్రణాళికా విభాగం, వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం జరగకుండా చూడాలంటూ సూచించారు. అక్రమ లేఅవుట్‌లపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళికా సూపర్‌వైజర్ లక్ష్మిని ఆదేశించారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ హోర్డింగ్‌లు, బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. సమీక్షలో టీపీఎస్ లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ లక్ష్యం పూర్తి చేయాలి

సిద్దవటం: పీఎం కిసాన్, ఈకేవైసీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు సూచించారు.

సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ-పంట నమోదు వివరాలను తెలుసుకున్నారు. ఖరీఫ్ 23 ప్రణాళిక పై అవగాహన కల్పించారు. అనంతరం సిద్దవటం లోని వ్యవసాయాధికారి కార్యాల యంలో రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులతో సమీక్షించి వారికి సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మేకల ప్రేమ్‌కుమార్, ఇతర సహాయకులు, వంతాటిపల్లె గ్రామ రైతులు చంద్రారెడ్డి, చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి

నందలూరు (రాజంపేట): పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వైద్యాధికారిణి సృజన నందలూరు–2 హెల్త్ సబ్‌సెంటర్‌లో మండల ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన అన్ని సదుపాయాలు సమకూరాయన్నారు. మెరుగైన వైద్యం అందజేయాలని ఆయన సూచించారు. రాజంపేట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.చెన్నకృష్ణ మాట్లాడుతూ పీహెచ్‌సీలో త్వరలోనే స్టాఫ్‌నర్స్‌ను నియమించి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. వైద్యాధికారిణి సృజన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీఓ సౌభాగ్య, తహసీల్దారు ఉదయశంకర్‌రాజు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలు జరగకుండా చూడండి



మాతృమరణాలపై సమీక్ష నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్ : వైద్యసిబ్బంది మాతాశిశు సంరక్షణ సేవలు సక్రమంగా అందించి మాతృమరణాలు జరగకుండా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య కోరారు. శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆయన ఫిబ్రవరి, మార్చి మాసాలలో చోటుచేసుకున్న మాతృమరణాలపై వైద్యసిబ్బంది, అధికారులతో సమీక్ష నిర్వహించారు. రామాపురం, యండపల్లె, చిన్నమండెం, ఓబులవారిపల్లె, చెంబకూరు, మదనపల్లెలో జరిగిన మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. మాతృమరణాల నివారణకు వీలైన అన్నిరకాల చర్యలు తీసుకోవాలంటూ అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, గైనకాలజిస్టు జీనత్‌బేగం, వైద్యులు భాస్కర రెడ్డి, వెంకటశివ, శైలేష్‌తో పాటు మదనపల్లె, చెంబకూరు, ఓబులవారిపల్లె, చిన్నమండెం, యండపల్లె, రామాపురం పీహెచ్‌సీల వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికలలో గెలుపొందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి సభ్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ ఎన్నికలలో మొత్తం 74 ఓట్లుకు గానూ 72 ఓట్లు పోలయ్యాయి.

అధ్యక్షుడిగా కె. నాగిరెడ్డి 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా పగడాల శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి రామాంజులు– నాగమల్లు సమాన ఓట్లు రాగా వీరిని చెరీ ఆరు నెలల సమాన కాలం పదవి చేపట్టే విధంగా నిర్ణయించారు. ట్రెజరర్‌గా వీరభద్రయ్య, స్పోర్ట్స్ కార్యదర్శిగా సిద్దయ్య, లైబ్రరీ సెక్రటరీగా రమణ మూర్తి గెలుపొందారు. బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి అధికారిగా అజ్మతుల్లా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో గెలుపొందిన వారిని ఆయన అభి నందించారు. ఈ సందర్భంగా బార్ అసోసి యేషన్ అధ్యక్షుడిగా గెలుపొందిన నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గెలుపొందినవారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత అమ్మవారికి రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవ సందడి



విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొల్పుతున్న ఒంటిమిట్ట కోదండరామయ్య ఆలయం



పూజా కార్యక్రమాలలో వేదపండితులు

ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వేద పండితులు శాస్త్రోకంగా పూజా కార్యక్రమాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. – ఒంటిమిట్ట



బ్రహ్మోత్సవాలలో వాయిద్యకారుల సందడి



కోదండరాముడి బ్రహ్మోత్సవాలలో స్వామివారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా

వేడుకగా శ్రీరామనవమి ఉత్సవాలు



రాజంపేట రూరల్: శ్రీరామచంద్రమూర్తికి 11రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలు 2వ రోజు శుక్రవారం పట్టణ, గ్రామ స్థాయిలో వేడుకగా నిర్వహించుకున్నారు. ఊరూరా నిర్వహించుకుంటున్న ఈ వేడుకలలో గ్రామాలలోని శ్రీకోదండరామాలయాల వద్ద పెద్ద ఎత్తున భజనలు చేస్తూ భక్తులు భక్తిని చాటుకుంటున్నారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ప్రత్యేకంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భువనగిరిపల్లెలో 2వ రోజు ధనలక్ష్మి అలంకారంలో ప్రత్యేకంగా కొలువు దీర్చారు.